సాక్షి
నల్లగొండ
గురువారం । 26 । జనవరి । 2023



అమ్మవారికి పోచంపల్లి చీరలు
బాసరలో అమ్మవార్లకు బహూకరించేందుకు పోచంపల్లి కళాకారులు పట్టుచీరలను రూపొందించారు. - 8లో



యాదాద్రిలో విశేష పూజలు
యాదాద్రి లక్ష్మీ నరసింహ స్వామి క్షేత్రంలో బుధవారం నిత్యపూజలు ఆచార్యులు విశేషంగా నిర్వహించారు. - 8లో

గరిష్టం/కనిష్టం
31°/17°

వాతావరణం
ఆకాశం నిర్మలంగా ఉంటుంది రాత్రిపూట చలి ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

అడిషనల్ కమాండెంట్‌కు ప్రెసిడెంట్ పోలీస్ మెడల్



రామకృష్ణ

నల్లగొండ క్రైం : అన్నెపర్తి 12వ బెటాలియన్‌కు చెందిన అడిషినల్ కమాండెంట్ బి.రామకృష్ణకు ప్రతిష్ఠాత్మకమైన ప్రెసిడెంట్ పోలీస్ మెడల్‌ను ప్రభుత్వం గురువారం ప్రకటించింది. 1991 మార్చి 16న ఏపీ ఎస్పీలో రిజర్వ్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా విధుల్లో చేరిన రామకృష్ణ సీఎం భద్రత విభాగంలో, అత్యంత సమస్యాత్మక ప్రాంతాల్లో విధులు నిర్వహించారు. అన్ని పరేడ్‌లకు కమాండర్‌గా పనిచేశారు. గ్రేహౌండ్స్‌లో విధులు నిర్వహించిన సమయంలో ఉత్తమ ప్రతిభ కనబర్చారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో గ్రేహౌండ్స్‌కు శిక్షణ ఇచ్చారు. ఇప్పటి వరకు ఆయన 2019లో ఏపీ పోలీస్ సేవా పతకం, 2019లో ఉత్తమ సేవా పతకం, 2014లో ఇండియన్ పోలీస్ మెడల్ పొందాడు. ప్రస్తుతం ఆయనకు ప్రెసిడెంట్ పోలీస్ మెడల్ దక్కింది. ఈ సందర్భంగా ఆయనను కమాండెంట్ సాంబయ్య, సిబ్బంది అభినందించారు.

నేడు ఉపాధ్యాయుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్

నల్లగొండ : ఉపాధ్యాయులకు సంబంధించి బదిలీలు, పదోన్నతుల ప్రక్రియలో భాగంగా పదోన్నతుల కోసం ఉపాధ్యాయుల సర్టిఫికెట్ల పరిశీలన కార్యక్రమం గురువారం మధ్యాహ్నం ఒంటి గంటకు డీఈఓ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి భిక్షపతి తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్ల నుంచి హెచ్‌ఎంలుగా పదోన్నతులు పొందేందుకు 2001 డీఎస్సీ వరకు జనరల్, ఎస్సీ ఉపాధ్యాయులు, 2006 డీఎస్సీ వరకు ఎస్టీలు హాజరుకావాలని.. వారు లేకపోతే ఆ కింది వారు కూడా హాజరు కావొచ్చని పేర్కొన్నారు. జిల్లా పరిషత్ పాఠశాలల్లో పని చేస్తున్న స్కూల్ అసిస్టెంట్లు 2002 డీఎస్సీ వరకు జనరల్, ఎస్సీ కేటగిరీలకు సంబంధించిన ఉపాధ్యాయులు, 2007 డీఎస్సీ వరకు ఎస్టీ కేటగిరీ ఉపాధ్యాయులు సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరు కావాలని పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

రామగిరి(నల్లగొండ) : తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల సీఓఈ (03) కళాశాలలలో 2023–24 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియట్ అడ్మిషన్ల కోసం ప్రవేశ పరీక్షకు దరఖాస్తులు చేసుకోవాలని ఆర్‌సీఓ హెచ్.అరుణకుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 31వ తేదీలోగా www.swreis.ac.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులు చేసుకున్న వారికి మార్చి 5వ తేదీన ప్రవేశ పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు.

‘ఉపాధి’ పనుల పరిశీలన



మహిళలతో మాట్లాడుతున్న బృందం సభ్యులు

మర్రిగూడ : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులను బుధవారం నేషనల్ లెవెల్ మానిటరింగ్ టీమ్ సభ్యుల బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా టీమ్ సభ్యుబు సురంజన్‌రెడ్డి మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా లబ్ధిపొందుతున్న రైతుల వివరాల రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మహిళా సంఘాల సభ్యులు పొదుపు రుణాలను సక్రమంగా చెల్లించి ప్రభుత్వం నుంచి రాయితీలను పొందాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జె.వెంకటేశ్వర్‌రావు, ఏపీడీ రవీందర్, ఎంపీఓ ఝాన్సీ, డీపీఎం అరుణ్‌కుమార్, మోహన్‌రెడ్డి, డ్వామా సూపరింటెండెంట్ దయాకర్, ఏపీఓ వెంకటేశం, ఏపీఎం హరి, ఈసీ వివేక్, పంచాయతీ కార్యదర్శి యూసుఫ్, టీఏ సత్యనారాయణ, శారద, శాంతి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల పనుల పరిశీలన



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

నార్కట్‌పల్లి : ఈనెల 28 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు నిర్వహించనున్న చెర్వుగట్టు బ్రహ్మోత్సవాల్లో భాగంగా చేపడుతున్న పనులను బుధవారం సాయంత్రం అడిషనల్ కలెక్టర్ భాస్కర్‌రావు.. ఆర్డీఓ జయచంద్రారెడ్డితో కలిసి పరిశీలించారు. పనుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని, ఏమైనా పనులు పెండింగ్‌లో ఉంటే బ్రహ్మోత్సవాల వరకు పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన తహసీల్దార్ మురళీమోహన్, దేవాలయ ఈఓ నవీన్‌కుమార్, ఎంపీడీఓ యాదగిరి తదితరులున్నారు.

రాజకీయ వేడి

- నల్లగొండలో తిరుగుబావుటా ఎగురవేసిన చకిలం అనిల్‌కుమార్
- తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించిన సీనియర్ నేత
- ఈ నియోజకవర్గంలో ఇప్పటికే కార్యక్రమాలు ముమ్మరం చేసిన ఆశావహులు
- సిట్టింగ్‌లకే టికెట్ అని సీఎం ప్రకటించినా ఎవరికివారుగా ప్రజల్లోకి..



నల్లగొండలో నిర్వహించిన తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనంలో అభివాదం చేస్తున్న చకిలం అనిల్‌కుమార్, బీఆర్‌ఎస్ నాయకులు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: నల్లగొండ జిల్లాలో రాజకీయ వాతావరణం వేడెక్కింది. సాధారణ ఎన్నికలకు ఇంకా 11 మాసాల సమయం ఉండగా.. అధికార పార్టీలో మాత్రం అప్పుడే ఎన్నికల వేడి ఊపందుకుంది. ముఖ్యంగా నల్లగొండ అసెంబ్లీ స్థానానికి అధికార పార్టీ నుంచి అధిక మంది టికెట్ ఆశిస్తున్నారు. సిట్టింగ్‌లకే టికెట్ ఇస్తామని ముఖ్యమంత్రి ప్రకటించినప్పటికీ ఆశావహులు ఎవరివారు ప్రజల్లోకి వెళ్లి కార్యక్రమాలను ముమ్మరం చేశారు. తాజాగా బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు చకిలం అనిల్ కుమార్ కూడా.. ఉద్యమకారులను పార్టీ నిర్లక్ష్యం చేస్తోందని, తనకు ఎమ్మెల్సీ పదవి ఇస్తానని ముఖ్యమంత్రి ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యమకారులను నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదంటూ బుధవారం తెలంగాణ ఉద్యమకారులతో నల్లగొండలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించి హెచ్చరించారు.

పోటాపోటీగా ఎమ్మెల్యేలు, ఆశావహులు

జిల్లాలో పలు నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలతో పాటు ఆశావహులు కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు. ముఖ్యంగా నల్లగొండ నకిరేకల్ నియోజకవర్గాల్లో అటు ఎమ్మెల్యేలు ఇటు ఆశావహులు పెద్ద ఎత్తున కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలతో మమేకం అవుతున్నారు. నకిరేకల్‌లో ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం వర్గీయులు పెద్ద ఎత్తున కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మిర్యాలగూడలోనూ ఎమ్మెల్యే భాస్కరరావు తనయుడు సిద్ధార్థ్ పలు సేవా కార్యక్రమాలు నిర్వహిన్నారు నల్లగొండలో బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు పిల్లి రామరాజు ఆర్‌కేఎస్ ఫౌండేషన్ ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇటీవల తన పుట్టిన రోజు సందర్భంగా పెద్దఎత్తున కార్యక్రమం నిర్వహించి.. వచ్చే ఎన్నికల్లో తాను పోటీచేయనున్నట్లు సంకేతాలు ఇచ్చారు. కొన్ని రోజుల నుంచి బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి చాడా కిషన్‌రెడ్డి నల్లగొండ నియోజకవర్గంలో తన అనుచరులతో కార్యక్రమాలు చేపడుతున్నారు. మరోవైపు శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి తనయుడు గుత్తా అమిత్‌రెడ్డి.. గుత్తా వెంకట్‌రెడ్డి ట్రస్టు పేరుతో పలు సేవా కార్యక్రమాలు చేస్తూ వచ్చే ఎన్నికల్లో పోటీలో ఉంటానన్న సంకేతాలు ఇస్తున్నారు. ఇన్నాళ్లు సైలెంట్‌గా ఉన్న చకిలం అనిల్ కుమార్ గళం పెంచారు.

ఇక జనాల్లోకి చకిలం...

తెలంగాణ రాష్ట్ర సమితి ఆవిర్భావం నుంచి పార్టీలో ఉంటూ ఉద్యమంలో తనదైన పాత్ర పోషించిన చకిలం అనిల్‌కుమార్ తన గళం విప్పారు. ఇన్నాళ్లు సౌమ్యంగా వ్యవహరించిన ఆయన స్వరం పెంచారు. తెలంగాణ ఉద్యమ సమయంలో టీఆర్‌ఎస్ తీర్థం పుచ్చుకొని అప్పటి నుంచి పార్టీకి, తెలంగాణ ఉద్యమానికి పనిచేస్తూ వచ్చారు. తెలంగాణ వచ్చిన తరువాత చకిలం అనిల్ టికెట్ ఆశించినా లభించలేదు. సీఎం కేసీఆర్ ఎమ్మెల్సీ పదవి ఇస్తానని హామీ ఇచ్చినా నెరవేరలేదు. ఎన్నికల సమయం దగ్గర పడుతుండడంతో బుధవారం చకిలం అనిల్ తెలంగాణ ఉద్యమకారుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యమ కారులను అవమానిస్తే సహించేది లేదని హెచ్చరించారు. అనిల్ తిరుగుబావుటాపై రాజకీయవర్గాల్లో విస్తృతంగా చర్చ జరుగుతోంది.

కలెక్టరేట్‌లో గణతంత్ర వేడుకలు

- జెండా ఆవిష్కరించనున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి



జెండాను సిద్ధం చేస్తున్న సిబ్బంది

నల్లగొండ : భారత గణతంత్ర దినోత్సవ వేడుకలు గురువారం కలెక్టరేట్ ఆవరణలో నిర్వహించనున్నారు. 74వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని అధికారులు అన్ని ఏర్పాటు చేశారు. ఉదయం 9 గంటలకు కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారు.

ఓటు ప్రాధాన్యం తెలియజేయాలి



ఓటర్ల దినోత్సవం సందర్భంగా ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

- కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి

నల్లగొండ : ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు ప్రాధాన్యం గురించి ప్రతిఒక్కరికి అవగాహన కల్పించి అరులంగా ఓటర్ జాబితాలో పేరు నమోదు చేయించుకునేలా అవగాహన కలిగించాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి సూచించారు. బుధవారం 13వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఓటర్లంతా ఎన్నికల సందర్భంగా ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. ఫారం–6 ద్వారా ఓటర్‌గా నమోదు చేసుకోడంతో పాటు 6బి ద్వారా ఓటర్‌కార్డుకు ఆధార్ అనుసంధానం చేసుకోవాలని సూచించారు. ఎన్నికల కమిషన్ రూపొందించిన ‘మై భారత్ హూ’ పాటను ఈ సందర్భంగా ప్రదర్శించారు. ఓటు హక్కు వినియోగంపై అందరి చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా నూతన ఓటర్లను కలెక్టర్ సన్మానించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఖుష్బూ గుప్తా, భాస్కర్‌రావు, జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి, ఆర్డీఓ జయచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా నూతన ఎస్పీగా అపూర్వరావు

- రామగుండం సీపీగా బదిలీ అయిన ఎస్పీ రెమా రాజేశ్వరి



అపూర్వరావు

నల్లగొండ క్రైం : జిల్లా నూతన ఎస్పీగా అపూర్వరావును నియమిస్తూ ప్రభుత్వం బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు ఎస్పీగా బాధ్యతలు నిర్వహించిన రెమా రాజేశ్వరి రామగుండం సీపీగా బదిలీ అయ్యారు. 2021 డిసెంబర్ 27న రెమా రాజేశ్వరి జిల్లాలో బాధ్యతలు చేపట్టారు. నూతన ఎస్పీ అపూర్వరావు వనపర్తి నుంచి నల్లగొండ జిల్లాకు బదిలీపై వస్తున్నారు. తుది ఉత్తర్వులు అర్ధరాత్రి వెలువడ్డాయి. హైదరాబాద్ బేగం బజారుకు చెందిన అపూర్వరావు తండ్రి సివిల్ కాంట్రాక్టర్. అపూర్వరావు టీసీఎస్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూనే సివిల్స్‌కు ప్రిపేర్ అయ్యారు. 2014లో ఐపీఎస్‌కు ఎంపికయ్యారు. తెలంగాణ కేడర్‌కు వచ్చిన తొలి తెలంగాణ మహిళా ఐపీఎస్‌గా ఆమె గుర్తింపు పొందారు. శిక్షణ తర్వాత గోదావరిఖని ఏఎస్పీగా కొన్నాళ్లు పనిచేశారు. సీఐడీ ఎస్పీగా కూడా విధులు నిర్వర్తించారు. ప్రస్తుతం వనపర్తి జిల్లా ఎస్పీగా పనిచేస్తున్నారు.

గ్రంథాలయ అభివృద్ధికి కృషిచేస్తా : కలెక్టర్



గ్రంథాలయాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

రామగిరి(నల్లగొండ) : జిల్లా కేంద్ర గ్రంథాలయ అభివృద్ధికి కృషి చేస్తానని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని సందర్శించారు. గ్రంథాలయ సంస్థ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, కార్యదర్శి బాణోతు బాలమ్మతో మాట్లాడి గ్రంథాలయ సంస్థ పరిస్థితులతో పాటు పలు అభివృద్ధి అంశాలపై సమీక్షించారు. భవనం మరమ్మతులు, సోలార్ సిస్టమ్, ఫర్నిచర్‌కు నిధులు కేటాయిస్తానని తెలిపారు. ఖాళీగా ఉన్న సిబ్బందిని భర్తీ చేస్తామన్నారు. అనంతరం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో సభ్యత్వం స్వీకరించారు. కార్యక్రమంలో ఆర్డీఓ జయచంద్రారెడ్డి, తహసీల్దార్ నాగార్జునరెడ్డి, సిబ్బంది నర్సింహారెడ్డి, నాగయ్య, నిర్మలాదేవి, రాజేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సైదన్న ఉర్సుకు సిద్ధం



విద్యుత్ కాంతుల్లో జాన్‌పహాడ్ దర్గా

నేటి నుంచి మూడు రోజుల పాటు ఉత్సవాలు

- ముస్తాబైన జాన్‌పహాడ్ దర్గా
- రేపు గంధం ఊరేగింపు
- అన్ని ఏర్పాట్లు చేసిన నిర్వాహకులు

పాలకవీడు: విభిన్న మతాల ఆధ్యాత్మిక ఝరి జాన్‌పహాడ్ దర్గా క్షేత్రం. మతసామరస్యానికి ప్రతీకకగా భక్తుల కోర్కెలు తీర్చే కొంగు బంగారంగా పాలకవీడు మండలంలోని జాన్‌పహాడ్ దర్గా విరాజిల్లుతోంది. ఈ దర్గా ఉర్సు గురువారం నుంచి మూడు రోజుల పాటు జరగనుంది. ఉత్సవాలకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వస్తుంటారు. వక్ఫ్‌బోర్డుతో పాటు అధికార యంత్రాంగం అన్ని చర్యలు చేపట్టింది.

ఉర్సు ఇలా..

- నేడు సూర్యోదయానికి ముందే బాబా సమాధుల వద్ద కొవ్వొత్తులతో ఉల్సా నిర్వహించి ఉర్సును ప్రారంభిస్తారు.
- 27న ప్రధాన ఘట్టమైన పవిత్ర గంధం ఊరేగింపు ఉంటుంది. వక్ఫ్‌బోర్డు ఆధ్వర్యంలో ముస్లిం మత పెద్దలు హైదరాబాద్‌లో ప్రత్యేక ప్రార్థనల మధ్య తయారు చేసిన పవిత్ర గంధాన్ని శుక్రవారం జాన్‌పహాడ్ గ్రామానికి తీసుకొచ్చి అక్కడి నుంచి అశ్వంపై ఊరేగింపుగా దర్గా వద్దకు తీసుకొచ్చి బాబా సమాధులకు సమర్పిస్తారు.
- 28వ తేదీన దీపారాధనతో ఉత్సవాలు ముగిస్తారు.

అసౌకర్యం కలగకుండా..

ఉత్సవాల్లో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికార యంత్రాగం అన్ని చర్యలు చేపట్టింది. పోలీస్, వైద్య ఆరోగ్య, రెవెన్యూ, పంచాయతీరాజ్ అధికారులు నిరంతర పర్యవేక్షణ చేపడతారు. మిర్యాలగూడ, సూర్యాపేట, కోదాడ డిపోల నుంచి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు. మంచినీటి సరఫరా కోసం ఆర్‌డబ్ల్యూఎస్, డెక్కన్ పరిశ్రమ వారు ట్యాంకర్లు ఏర్పాటు చేశారు. ఎప్పటికప్పుడు దర్గా వద్ద వివిధ ప్రాంతాల్లో చెత్తాచెదారం తొలగించేందుకు పారిశుద్ధ్య కార్మికులను నియమించారు. శూన్యపహాడ్, పాలకవీడు రూట్‌ల నుంచి వచ్చే వాహనాలను రెండు రోజులపాటు దర్గా ప్రాంతంలోకి అనుమతించరు. కోదాడ డీఎస్పీ వెంకటేశ్వర్‌రెడ్డి, సీఐ రామలింగారెడ్డి ఆధ్వర్యంలో 300 మంది పోలీస్, స్పెషల్ పార్టీ బలగాలతో బందోబస్తు నిర్వహించనున్నారు. ఉత్సవాల సందర్భంగా 24 గంటలు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు.

కలెక్టర్, ఎస్పీకి అరటి గెల అందజేత





కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి, ఎస్పీ రెమా రాజేశ్వరికి అరటి గెలలు అందజేస్తున్న అంజయ్య

రామగిరి(నల్లగొండ), నల్లగొండ క్రైం : సమాచార హక్కు పరిరక్షణ సమితి తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ బండమీద అంజయ్య తన వ్యవసాయ క్షేత్రంలో సేంద్రియ పద్ధతిలో పండించిన చక్కెర కేళీ అరటిపండ్లను కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, ఎస్పీ రెమా రాజేశ్వరికి బుధవారం అందజేశారు. తాను సేంద్రియ పద్ధతిలో అనేక పండ్ల మొక్కలను సాగు చేస్తున్నట్లు తెలపగా కలెక్టర్, ఎస్పీ అంజయ్యను అభినందించారు.

ఆర్థికసాయం చెక్కుల అందజేత

నల్లగొండ క్రైం : లైంగిక వేధింపుల కేసులో బాధితులకు పోలీస్‌శాఖ తరుపున బుధవారం ఎస్పీ రెమా రాజేశ్వరి తన కార్యాలయంలో ఆర్థిక సాయం చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలల, మహిళలకు భరోస కేంద్రం ద్వారా ప్రభుత్వ, పోలీస్, న్యాయ పరమైన సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. షీటీఎం ద్వారా మహిళలకు భరోసా కల్పిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఏఎస్పీ ప్రసాద్‌రావు, షీటీం ఇన్‌చార్జ్ సీఐ రాజశేఖర్, ఉమెన్ ఏఎస్‌ఐ అబెదా, నళిని తదితరులు పాల్గొన్నారు.

హాథ్ సే హాథ్ జోడో యాత్రను జయప్రదం చేయాలి

- డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్




సమావేశంలో మాట్లాడుతున్న శంకర్‌నాయక్

మిర్యాలగూడ : ఈనెల 26 నుంచి ప్రారంభమయ్యే హాథ్ సే హాథ్ జోడో యాత్రను జయప్రదం చేయాలని డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్ కోరారు. బుధవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జోడో యాత్రలో భాగంగా అన్ని మండల, పట్టణ కేంద్రాల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేస్తామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరిస్తూ కాంగ్రెస్ పార్టీ స్టిక్కర్‌ను ప్రతి ఇంటికి అతికించాలని కార్యకర్తలకు సూచించారు. సమావేశంలో పీసీసీ సభ్యుడు చిరుమర్రి కృష్ణయ్య, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బత్తుల లక్ష్మారెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్‌రెడ్డి, ఎంఏ.సలీం, రామలింగయ్య, శ్రీనివాస్, చిలుకూరి బాలు, మాలి కాంతారెడ్డి, తలకొప్పుల సైదులు, ముదిరెడ్డి నర్సిరెడ్డి, కందుల నర్సింహారెడ్డి, శేఖర్‌రెడ్డి, ఎస్‌కె.అబ్దుల్లా, చాంద్‌పాషా, మస్తాన్, ఇమ్రాన్‌ఖాన్ పాల్గొన్నారు.

ప్రైవేట్ ఆస్పత్రుల కాసుల కక్కుర్తి!

- కాన్పు కోసం వెళ్తే సిజేరియన్‌కే మొగ్గు
- ఆర్థికంగా నష్టపోతున్న ప్రజలు
- ప్రభుత్వ ఆస్పత్రుల్లో మాత్రం అధికంగా సాధారణ ప్రసవాలు



మిర్యాలగూడ మండలం తుంగపాడు గ్రామానికి చెందిన ఓ గర్భిణి ప్రతి నెలా ప్రభుత్వ ఆస్పత్రిలో చెకప్ చేసుకుంటూ, గ్రామంలోని ఏఎన్‌ఎం ఇచ్చే సూచనలు పాటిస్తూ జాగ్రత్తలు తీసుకుంటోంది. ఇటీవల నెలలు పడ్డాయి. ఈ సమయంలో కడుపు నొప్పి అనిపించింది. దీంతో ఆమె భర్త మిర్యాలగూడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రి గైనకాలజిస్ట్ వద్దకు తీసుకొచ్చాడు. అంతే.. నొప్పి దగ్గదానికి అంటూ గ్లూకోజ్ బాటిల్ పెట్టారు. కొన్ని గంటల తర్వాత నొప్పి ఎక్కువైంది. పురిటి నొప్పులు ప్రారంభమయ్యాని, వెంటనే ఆపరేషన్ చేయకుంటే కడుపులో బిడ్డకు ప్రమాదమని సదరు వైద్యులు చెప్పడంతో విధిలేని పరిస్థితుల్లో ఆపరేషన్ చేశారు. ఆపరేషన్ తర్వాత బయటికి తీసిన బిడ్డకు నెలలు నిండలేదని వెంటనే ఇంక్యుబేటర్‌లో పెట్టాలని చిల్డ్రన్స్ వైద్యులు సూచించారు. ఇలా తల్లి ఆపరేషన్, శిశువు ట్రీట్మెంట్‌కు కలిపి చూస్తే బిల్లు తడిసి మోపెడైంది. ఇదీ ప్రస్తుతం ప్రైవేట్ ఆస్పత్రుల్లో పరిస్థితి.

మిర్యాలగూడ అర్బన్ : కాన్పుకోసం వెళ్తే.. సిజేరియన్‌కే ప్రాధాన్యమిస్తున్నాయి ప్రైవేట్ ఆస్పత్రులు. సిజేరియన్ల వల్ల మహిళలకు భవిష్యత్‌లో ఆరోగ్య సమస్యలు వస్తాయని, గర్భసంచి సమస్యలు కూడా వచ్చే ప్రమాదం ఉందని వైద్యారోగ్య శాఖ అధికారులు ప్రచారం చేస్తున్నా.. కొందరు వైద్యులు మాత్రం అవేం పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. తొమ్మిదో నెల పడ్డాక ఆస్పత్రికి వెళ్తే చాలు ఏదో ఒకటి చెప్పి సిజేరియన్ చేసి శిశువును చేతిలో పెడుతున్నారు. దీంతో బాధితులు ఆర్థికంగా, ఆరోగ్య పరంగా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. గతంలో ప్రైవేట్ ఆస్పత్రుల్లో వైద్య ఆరోగ్యశాఖ ఆకస్మికంగా తనిఖీలు చేపట్టి ప్రసవాల సంఖ్య.. వాటిలో నార్మల్ డెలివరీలు, సిజేరియన్ల పూర్తి సమాచారం సేకరించేంది. సిజేరియన్లు ఎక్కువగా చేసే ఆయా ఆస్పత్రులకు సీరియస్‌గా వార్నింగ్ ఇచ్చేది. ప్రస్తుతం అలాంటి తనిఖీలు లేకపోవడంతో కొందరు ప్రైవేట్ వైద్యులు కాసులకు కక్కుర్తి పడి సిజేరియన్లు చేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి.

ప్రభుత్వం ఆస్పత్రుల్లో ఎక్కువగా నార్మల్ డెలివరీలే..

ప్రభుత్వ ఆస్పత్రుల్లో మాత్రం నార్మల్ డెలవరీలకు ఎక్కువగా ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇక్కడ చాలా వరకు నార్మల్ డెలివరీలు అవుతున్నాయి. కానీ ప్రైవేట్ ఆస్పత్రుల్లో మాత్రం పరిస్థితి భిన్నంగా ఉంది. 87 శాతానికి పైగా సిజేరియన్లు చేస్తున్నారంటే ప్రైవేట్ వైద్యుల దనదాహం ఏ మేరకు ఉందో అర్థం చేసుకోవచ్చు. గ్రామాల్లో ఏఎన్‌ఎం, ఆశ కార్యకర్తలు నార్మల్ డెలివరీలపై గర్భిణులకు అవగాహన కల్పిస్తూ, వారిని ప్రభుత్వ ఆస్పత్రుల్లో చూపించి ఇక్కడ ప్రసవం చేయించుకోవాలని చెబుతున్నా కొందరు ప్రైవేట్ ఆస్పత్రుల బాటపట్టి ఆర్థికంగా నష్టపోతున్నారు. జిల్లా అధికార యంత్రాంగం, వైద్యారోగ్యశాఖ అధికారులు ప్రైవేట్ వైద్యశాలల్లో ప్రసవాలపై నిఘా ఉంచి.. సిజేరియన్లు తగ్గించేందుకు పటిష్టమైన చర్యలు తీసుకుంటేనే మార్పు వచ్చే అవకాశం ఉందని పలువురు పేర్కొంటున్నారు.

జిల్లాలో ప్రసవాలు ఇలా..

ప్రభుత్వ ఆస్పత్రుల్లో..

సంవత్సరం	సిజేరియన్స్	నార్మల్ డెలివరీలు
2017-18	5493	3040
2018-19	6778	4158
2019-20	6623	5119
2020-21	6508	4777
2021-22	7231	5163
2022-23	6221	4525

ప్రైవేట్ ఆస్పత్రుల్లో..

సంవత్సరం	సిజేరియన్స్	నార్మల్ డెలివరీలు
2017 -18	6660	1008
2018-19	7704	1182
2019-20	7999	1355
2020-21	9235	1278
2021-22	9709	1358
2022-23	6141	1404

క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం



నార్మల్ డెలివరీలు పెంచాలని ప్రభుత్వం చెబుతోంది. జిల్లాలో నూరు శాతం నార్మల్ డెలివరీలు జరిగే విధంగా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాం. అనవసరంగా సిజేరియన్లు చేసే ప్రైవేట్ ఆస్పత్రులను గుర్తించి క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం. ఈ విషయాన్ని ఇప్పటికే ప్రైవేట్ ఆస్పత్రుల వైద్యులకు వివరించాం. అవసరమైతే తప్ప సిజేరియన్ చేయవద్దని గట్టిగా చెబుతున్నాం. మహిళలు కూడా అనవసరంగా ఆపరేషన్లు చేయించుకుని ఆరోగ్య పరంగా ఇబ్బందులు పడొద్దు.

– అనిమల్ల కొండల్‌రావు, డీఎంహెచ్‌ఓ

క్లుప్తంగా

విద్యార్థి అదృశ్యం



ప్రణయ్‌కుమార్

మునగాల(కోదాడ): మండలంలోని నేలమర్రి గ్రామానికి చెందిన బాష పంగు ప్రణయ్‌కుమార్ గత రెండు రోజులుగా కనిపించడం లేదని బుధవారం అతడి తండ్రి బాష పంగు శ్రీనివాస్ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ పి. లోకేష్ తెలిపారు. ప్రణయ్‌కుమార్ ప్రస్తుతం ఐటీఐ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడని సోమవారం రాత్రి 8గంటల సమయంలో ఎవరికీ చెప్పకుండా బైక్‌పై ఇంటి నుంచి బయటకు వెళ్లి, ఇంతవరకు తిరిగి రాలేదని అతడి తండ్రి తన ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ఇదిలా ఉండగా ప్రణయ్‌కుమార్ మానసికస్థితి సరిగా లేకపోవడంతో గతంలో విజయవాడలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. కాగా మంగళవారం సాయంత్రం ఏడు గంటల సమయంలో ప్రణయ్‌కుమార్ బైక్, చెప్పులు, సెల్‌ఫోన్ మునగాల శివారులో గల సాగర్ ఎడమ కాలువ ఒడ్డున ఉన్నట్లు తెలియడంతో తల్లిదండ్రులు అక్కడికి వెళ్లి చూడగా అతడి జాడ తెలియలేదు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

యాచకుడు మృతి

నార్కట్‌పల్లి: మండలంలో చెర్వుగట్టు క్షేత్రంలో యాచకుడిగా(55) జీవనం సాగిస్తున్న వ్యక్తి అనారోగ్యానికి గురికావడంతో నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందినటుల నార్కట్‌పల్లి ఎస్‌ఐ రామకృష్ణగౌడ్ తెలిపారు. గ్రామపంచాయతీ కార్యదర్శి కిరణ్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

వలస కూలీ కుటుంబంలో విషాదం



ప్రమాదంలో దగ్ధమైన ఇల్లు



అంజమ్మ (ఫైల్)



మధుమతి (చిన్ననాటి ఫొటో)

- గ్యాస్ సిలిండర్ పేలి తల్లి, కుమార్తె దుర్మరణం
- మెదక్ జిల్లా చేగుంట మండలం చిన్నశివునూర్‌లో ఘటన
- ఉపాధి నిమిత్తం చేగుంట నుంచి రాజాపేటకు వలస వచ్చిన కుటుంబం

రాజాపేట: మెదక్ జిల్లా నుంచి రాజాపేట మండలానికి వలస వచ్చి కూలీ పనులు చేసుకుంటున్న వ్యక్తి కుటుంబంలో విషాదం నెలకొంది. గ్యాస్ సిలిండర్ పేలి అతడి తల్లి, కుమార్తె మంగళవారం అర్ధరాత్రి మృతిచెందారు. వివరాలు ఇలా ఉన్నాయి. మెదక్ జిల్లా చేగుంట మండలంలోని చిన్నశివునూర్ గ్రామానికి చెందిన పిట్టల రాకేష్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు సంతానం. రాకేష్ ఉపాధి నిమిత్తం తల్లి అంజమ్మ(65), కుటుంబంతో కలిసి తన అత్తగారి ఊరైన యాదాద్రి భువనగిరి జిల్లాలోని మోటకొండూరు మండలం ముత్తిరెడ్డిగూడేనికి నాలుగేళ్ల క్రితం వలస వచ్చి స్థానికంగా పౌల్ట్రీఫాంలో పనికి కుదిరాడు. అయితే అతడి తోడల్లుడు హైదరాబాద్ నుంచి రాజాపేట మండలంలోని పిట్టలగూడెం గ్రామానికి వలస వచ్చి జీవనోపాధి పొందుతున్నాడు. తోడల్లుడి సూచనతో రాకేష్ కూడా 10రోజుల క్రితం కుటుంబంతో కలిసి పిట్టలగూడేనికి మకాం మార్చి స్థానికంగా ఓ ప్రైవేట్ సోలార్ ప్రాజెక్టులో దినసరి కూలీగా పనిచేస్తున్నాడు. భార్య పత్తి కూలీగా పనిచేస్తుండగా, అతడి తల్లి అంజమ్మ ఇంటి వద్దే ఉంటూ పిల్లలను చూస్తుండేది. అంజమ్మ రెండుమూడు నెలలకు ఒకసారి స్వగ్రామం చిన్నశివునూర్‌కు వెళ్లి ప్రభుత్వం ఇచ్చే పింఛన్ తీసుకొచ్చుకునేది. గత రెండు మూడు నెలల నుంచి ఆమె పింఛన్ కోసం వెళ్లకపోవడంతో తన పింఛన్ తొలగిస్తారేమోనని మంగళవారం ఉదయం రాకేష్ పెద్ద కుమార్తె మధుమతి(6)తో కలిసి స్వగ్రామానికి వెళ్లింది. రాత్రి కావడంతో అక్కడే తన ఇంట్లో మనుమరాలితో కలిసి నిద్రించింది. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు అర్ధరాత్రి ఇంట్లో గ్యాస్ సిలిండర్ పేలడంతో ఇద్దరూ మృతిచెందారు. సమాచారం అందుకున్న రాకేష్ కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం ఉదయం స్వగ్రామానికి వెళ్లినట్లు స్థానికులు తెలిపారు. అక్కడి పోలీసులు ఘటనా స్థలానికి చేరకుని అక్కడే మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించినట్లు సమాచారం.

సిలిండర్ ఎలా పేలింది?

అయితే గ్యాస్ సిలిండర్ ఎలా పేలిందనే విషయమై చేగుంట పోలీసులు విచారణ జరుపుతున్నట్లు తెలిసింది. అంజమ్మ రాజమ్మ ఇంట్లో కరెంట్ సౌకర్యం లేదని, రాత్రి నిద్రించే సమయంలో కొవ్వొత్తి వెలిగించిందని, ఆ సమయంలోనే గ్యాస్ లీక్ అయ్యి సిలిండర్ పేలిందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

బైక్‌ను ఢీకొట్టిన కారు.. వ్యక్తి దుర్మరణం



కోటిరెడ్డి మృతదేహం

హాలియా: బైక్‌ను కారు ఢీకొట్టిన ఘటనలో ఘటనలో ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. ఈ ఘటన హాలియా మున్సిపాలిటీ పరిధిలోని ఈశ్వర్‌నగర్‌లో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దవూర మండలంలోని పెద్దగూడెం గ్రామానికి చెందిన మల్‌రెడ్డి కోటిరెడ్డి(45) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. వ్యవసాయ పనుల నిమిత్తం బుధవారం ద్విచక్ర వాహనంపై హాలియాకు వచ్చిన ఆయన రాత్రి తిరిగి స్వగ్రామానికి వెళ్తున్నాడు. మార్గమధ్యలో ఈశ్వర్‌నగర్ శివారులోకి చేరుకోగానే పీఏపల్లి నుంచి మిర్యాలగూడ వైపు వెళ్తున్న కారు ఎదురుగా వచ్చి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కోటిరెడ్డి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు. మృతుడి భార్య మణెమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ క్రాంతికుమార్ తెలిపారు.

ఇంట్లో నుంచి వెళ్లిపోయిన వృద్ధుడు మృతి



పేరాల సత్తిరెడ్డి (ఫైల్)

రామన్నపేట: మతిస్థిమితం కోల్పోయి ఇంట్లో నుంచి వెళ్లిపోయిన మండలంలోని కొత్తగూడెం గ్రామానికి చెందిన పేరాల సత్తిరెడ్డి మృతిచెందినట్లు రామన్నపేట పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కొత్తగూడెం గ్రామానికి చెందిన పేరాల సత్తిరెడ్డి(80) మతిస్థిమితం కోల్పోయాడు. ఈ నెల 19న సాయంత్రం ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అతడి కోసం కుటుంబ సభ్యులు, బంధువులు ఎంత వెతికినా ఆచూకీ లభించక పోవడంతో 21న రామన్నపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా మంగళవారం సాయంత్రం లక్ష్మాపురం శివారులోని చెరువు వద్ద సత్తిరెడ్డి విగత జీవిగా పడి ఉండడం గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. దారి తప్పిపోయిన సత్తిరెడ్డి చెరువు సమీపంలో సొమ్మసిల్లి పడిపోయి మృతిచెంది ఉంటాడని, అతడి మృతిపై ఎలాంటి అనుమానం లేదని మేనల్లుడు కొండల్‌రెడ్డి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీకొట్టిన డీసీఎం

- తీవ్రంగా గాయపడిన ట్రాక్టర్ డ్రైవర్
- చికిత్స నిమిత్తం ఖమ్మం తరలిస్తుండగా మృతి

కోదాడరూరల్: ట్రాక్టర్‌ను వెనుక నుంచి డీసీఎం ఢీకొట్టిన ఘటనలో ట్రాక్టర్ డ్రైవర్ మృతిచెందాడు. ఈ సంఘటన కోదాడ పట్టణ పరిధిలోని శ్రీరంగాపురం బైపాస్ వద్ద బుధవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోదాడ మండల పరిధిలోని నల్లబండగూడెం గ్రామానికి చెందిన యరమాల ఉపేందర్(31) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం తెల్లవారుజామున ట్రాక్టర్‌పై కోదాడ నుంచి శ్రీరంగాపురం బైపాస్ మీదుగా తన స్వగ్రామానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్తున్న డీసీఎం వేగంగా వచ్చి ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ పల్టీ కొట్టడంతో ఉపేందర్‌కు తీవ్రగాయాలయ్యాయి. అతడిని కోదాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా వైద్యులు పరిస్థితి విషమంగా ఉందని తెలిపారు. దీంతో మెరుగైన చికిత్స నిమిత్తం ఖమ్మం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. మృతుడి భార్య కోటమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శివశంకర్ తెలిపారు.

కారు ఢీకొని గొర్రెల కాపరి మృతి



ఘటనా స్థలంలో రాములు మృతదేహం

చివ్వెంల(సూర్యాపేట): అతివేగంగా వస్తున్న కారు అదుపుతప్పి గొర్రెల కాపరిని ఢీకొట్టడంతో అతడు మృతిచెందాడు. ఈ ఘటన చివ్వెంల మండల పరిధిలోని దురాజ్‌పల్లి గ్రామ స్టేజీ వద్ద విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మునగాల మండలం మాధవరం గ్రామానికి చెందిన దాసరి రాములు(58) గొర్రెలు కాసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం అతడు గొర్రెలను మేపేందుకు సూర్యాపేట వైపు తోలుకుని వెళ్తుండగా దురాజ్‌పల్లి వద్ద జాతీయ రహదారిపై విజయవాడ నుంచి హైదరాబాద్‌వైపునకు వెళ్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రాములు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి కుమారుడు వెంకన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ విష్ణుమూర్తి కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూర్యాపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

ఇద్దరు వ్యక్తుల మధ్య ఘర్షణ

- కత్తితో దాడి.. ఒకరికి గాయాలు

డిండి: ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన ఘర్షణలో ఒకరికి గాయాలైన సంఘటన బుధవారం మండలంలోని కామేపల్లిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. కామేపల్లి గ్రామానికి చెందిన గోరటి బాలయ్య, నల్ల వెంకటయ్య కూలీ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఇరువురి మధ్య పాత కక్షలు ఉండడంతో తరుచూ గొడవ పడుతుండేవారు. సోమవారం రాత్రి బాలయ్య ఇంటి వద్దకు వెళ్లిన వెంకటయ్య ఇరువురు మాట్లాడుకుంటున్న క్రమంలో మాటామాట పెరిగి ఘర్షణ పడ్డారు. ఈ క్రమంలో వెంకటయ్య తన వెంట తెచ్చుకున్న గొడ్డలితో బాలయ్యపై దాడి చేశాడు. దీంతో బాలయ్య తల, చెవికి గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు గమనించి బాలయ్యను చికిత్స నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనకు సంబంధించి తమకెలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ సురేష్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

భువనగిరి: భువనగిరి పట్టణ శివారులోని బైపాస్ రోడ్డులో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. వివరాలు.. జనగామ జిల్లాకు చెందిన రంగు శ్రీనివాస్ తన కుమార్తె రమ్య, కుమారుడు లక్ష్మణ్‌తో కలిసి బైక్‌పై హైదరాబాద్‌కు వెళ్తున్నారు. ఈ క్రమంలో భువనగిరి పట్టణంలోని వివేరా హోటల్ సమీపంలోకి రాగానే హెల్మెట్ అద్దం ఒకేసారి కిందికి రావడంతో దారి కనిపించక శ్రీనివాస్ సడన్ బ్రేక్ వేశాడు. దీంతో బైక్ అదుపుతప్పి కిందపడటంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు 108 వాహనంలో భువనగిరిలోని జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు.

చేపల చెరువు పరిశీలన



చేపల చెరువును పరిశీలిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యే చిరుమర్తి

చిట్యాల: మండలంలోని ఏపూరు గ్రామ శివారులో బొక్కా యాదిరెడ్డి వ్యవసాయ క్షేత్రంలోని చేపల చెరువును బుధవారం రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి.. నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యతో కలిసి పరిశీలించారు. చేపల పెంపకం వివరాలను అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు ఆ గ్రామానికి చెందిన మంత్రి జగదీశ్‌రెడ్డి ఓఎస్‌డీ దేవేందర్‌రెడ్డి తల్లి భద్రమ్మ దశదిన కర్మలో పాల్గొన్నారు. వారి వెంట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ పాలెం మల్లేష్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

యాదాద్రిలో విశేష పూజలు



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న ఆచార్యులు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి క్షేత్రంలో బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు నిత్య పూజలను ఆచార్యులు విశేషంగా జరిపించారు. వేకువ జామునే ఆలయాన్ని తెరిచిన ఆచార్యులు సుప్రభాతం నిర్వహించారు. అనంతరం స్వయంభూలకు బిందెతీర్థం, ఆరాధన గావించారు. శ్రీస్వామి వారికి బాలభోగం చేపట్టిన తరువాత మూలవర్యులకు నిజాభిషేకం నిర్వహించి, పట్టువస్త్రాలతో అలంకరించారు. శ్రీస్వామివారికి విశేషంగా సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన పూజలు చేపట్టారు. అనంతరం భక్తులకు శ్రీస్వామి వారి దర్శనం భాగ్యం కల్పించారు. ఇక ఆలయంలో సుదర్శన నారసింహ హోమం, బ్రహ్మోత్సవం, నిత్య కల్యాణం, తిరువీధి జోడు సేవలను నిర్వహించారు. రాత్రి పవళింపు సేవను నిర్వహించి, ఆలయాన్ని మూసివేశారు.

ప్రాధాన్యతా క్రమంలో బడ్జెట్ కేటాయింపులు చేయాలి

- సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు



సమావేశంలో మాట్లాడుతున్న చెరుపల్లి సీతారాములు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాధాన్యతా క్రమంలో బడ్జెట్ కేటాయింపులు చేయాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు, శాసనమండలి మాజీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి ఒకటి నుంచి కేంద్ర బడ్జెట్, ఫిబ్రవరి 3 నుంచి రాష్ట్ర బడ్జెట్ సమావేశాలు జరగనున్న నేపథ్యంలో మొదటి ప్రాధాన్యత వెనుకబడిన ప్రాంతాలకు ఇవ్వాలని, సంక్షేమ రంగానికి నిధులు పెంచాలని కోరారు. బడ్జెట్‌లో కేటాయింపులు పెరుగుతున్నాయి తప్ప కేటాయించిన బడ్జెట్‌ను ఖర్చు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ బడ్జెట్ లోనైనా గత సంవత్సరం ఖర్చు చేయని నిధులను కలిపి కొత్తగా నిధులు కేటాయించాలని కోరారు. బడ్జెట్‌లో అన్ని వర్గాల ప్రజలకు ప్రాధాన్యమివ్వాలన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయాలని కోరారు. మిర్యాలగూడ నుంచి సూర్యాపేట మీదుగా కాజీపేట వరకు రైలు మార్గం ఏర్పాటు చేయాలని అనేక సంవత్సరాలుగా ఉద్యమాలు నిర్వహిస్తున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. బీఆర్‌ఎస్‌తో కలిసి పని చేసినంత మాత్రాన ప్రజా సమస్యలపై రాజీ పడే ప్రసక్తే లేదన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై బలమైన ఉద్యమాలు నిర్వహిస్తామన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి , యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి ఎండీ. జహంగీర్, రాష్ట్ర కమిటీ సభ్యురాలు బట్టుపల్లి అనురాధ తదితరులు పాల్గొన్నారు.

బాసర అమ్మవారికి పోచంపల్లి పట్టుచీరలు



అమ్మవారికి బహూకరించడానికి తయారు చేసిన పోచంపల్లి ఇక్కత్ చీర



తయారుచేసిన పట్టు చీరలు

భూదాన్‌పోచంపల్లి: బాసరలో శ్రీ సరస్వతీదేవితో పాటు లక్ష్మీదేవి, మహంకాళి అమ్మవార్లకు బహూకరించేందుకు పోచంపల్లి చేనేత కళాకారులు మూడు ఇక్కత్ పట్టుచీరలను రూపొందించారు. అలాగే వేదవ్యాస రుషికి పట్టు పంచె, శాలువాను కూడా తయారు చేసి బుధవారం నిర్వాహకులకు అందజేశారు. ప్రతి ఏటా వసంతోత్సవాన్ని పురస్కరించుకొని అమ్మవార్లను అలంకరించడానికి బాసరలోని పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో పట్టుచీరలను తయారు చేయిస్తారు. అందులో భాగంగా ఈసారి పోచంపల్లి ఇక్కత్ చీరలను బహూకరించడానికి పోచంపల్లికి చెందిన చేనేత కళాకారులు మేకల రామకృష్ణ, మారెపల్లి పురుషోత్తం, కడవేరు రాజేశ్‌లను బాసరకు పిలిపించారు. వారు అక్కడే ఆరు రోజుల పాటు ఎంతో నిష్టతో రాత్రింబవళ్లు మగ్గంపై 9 గజాల చీర, పంచె, శాలువా నేశారు. బుధవారం వాటిని పద్మశాలీ సంఘం ప్రతినిధులకు అందజేశారు. కాగా, గురువారం నిర్వహించనున్న వసంతోత్సవంలో భాగంగా అమ్మవార్లకు పట్టు చీరలు, వేద వ్యాసరుషికి పంచను బహూకరించనున్నారని చేనేత కళాకారులు తెలిపారు. బాసర జ్ఞానసరస్వతీదేవికి, లక్ష్మీదేవి, మహంకాళి అమ్మవారు, వేదవ్యాసరుషికి పట్టు వస్త్రాలను తయారు చేయడం తమ అదృష్టంగా భావిస్తున్నామని చేనేత కళాకారుడు మేకల రామకృష్ణ ఆనందం వ్యక్తం చేశాడు.

ఓటు హక్కును బాధ్యతగా వినియోగించుకోవాలి

- సూర్యాపేట జిల్లా ఎస్పీ రాజేంద్రప్రసాద్



డీజీపీతో వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఎస్పీ రాజేంద్రప్రసాద్

సూర్యాపేటక్రైం: రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతిఒక్కరూ బాధ్యతగా వినియోగించుకోవాలని సూర్యాపేట ఎస్పీ రాజేంద్రప్రసాద్ అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా బుధవారం సూర్యాపేట జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ ఆధ్వర్యంలో పోలీసు అధికారులు, సిబ్బందికి ఓటు హక్కు ప్రాముఖ్యత గురించి వివరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ఓటు హక్కు గురించి భావితరాలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. బాధ్యతగా ఓటు హక్కును సద్వినియోగం చేసుకుంటామని ఎస్పీ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డీఎస్పీలు నాగభూషణం, వెంకటేశ్వరరెడ్డి, రవి, ఏఓ సురేష్‌బాబు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, డీసీఆర్‌బీ నర్సింహ, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ గౌరీనాయుడు, సీఐలు సోమనారాయణసింగ్, రాజశేఖర్, ఆంజనేయులు, శివశంకర్, పీఎస్సీ ప్రసాద్, రాజేష్, నాగార్జున, ఆర్‌ఐలు శ్రీనివాసరావు, ఎంటీఓ శ్రీనివాస్, వెల్ఫేర్ గోవిందరావు సిబ్బంది పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఎస్పీ..

కేసుల స్థితిగతులు, ఆన్‌లైన్ నమోదు, కమ్యూనిటీ కార్యక్రమాలు, మహిళల రక్షణ, సాంకేతికత, ఆధునిక పోలీసింగ్ మొదలగు అంశాలపై బుధవారం డీజీపీ అంజనీకుమార్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్పీ రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు. సమావేశంలో డీఎస్పీలు నాగభూషణం, వెంకటేశ్వరరెడ్డి, డీసీఆర్‌బీ డీఎస్పీ రవి, ఏఓ సురేష్‌బాబు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ నర్సింహ, సీఐలు తదితరులు పాల్గొన్నారు.


ఆవులు, దూడల ప్రదర్శన అద్భుతం: ఎమ్మెల్యే బొల్లం



ఆవులు, దూడల ప్రదర్శనను తిలకిస్తున్న ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్

చిలుకూరు: చిలుకూరులో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన మేలు జాతి ఆవులు, దూడల ప్రదర్శన అద్భుతంగా ఉందని కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. చిలుకూరు పశువైద్యశాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శనను ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతులు వ్యవసాయంతో పాటు పాడిపరిశ్రమలో రాణిస్తే ఆర్థికంగా బలోపేతం కావొచ్చునని అన్నారు. మండల వ్యాప్తంగా 200 దూడలు, ఆవులను రైతులు ఈ ప్రదర్శనకు తీసుకొచ్చారు. పుంగనూరు, ఒంగోలు, హెచ్‌ఎఫ్(బ్లాక్ ఆవులు), జెర్సీ, గిరి జాతి ఆవులు, ముర్రా జాతి దూడలను ప్రదర్శించారు. కొండారు వెంకటేశ్వర్లుకు చెందిన పుంగనూరు జాతి ఆవు, కాశబోయిన రంగారావు హెచ్‌ఎఫ్ జాతి ఆవు, షేక్ సాహెబ్ అలీ గిరిజాతి ఆవు, గోగుల వీరభద్రం జెర్సీ ఆవు, నాగిరెడ్డి నారాయణరెడ్డి ఒంగోలు జాతి ఆవు ప్రథమ బహుమతులు సాధించాయి. అదేవిధంగా బెక్కం వీరబాబు, కొండారు శ్రీనుకు చెందిన ఆవుల దూడలు, గంగిరెడ్డి నాగిరెడ్డి, బానోతు శ్రీను, గుజ్జుల అంజిరెడ్డి, బహుదొడ్డి వెంకటయ్య, బెల్లం కొండ వెంకటేశ్వర్లుకు చెందిన గేదె దూడలు ప్రథమ బహుమతులు సాధించగా, ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జేడీ శ్రీనివాస్‌రావు, మాజీ ఎంపీపీ దొడ్డా నారాయణరావు, డీసీసీబీ డైరెక్టర్ కొండా సైదయ్య, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు జానివియా, సర్పంచ్ కొడారు బాబు, డీఎల్‌డీఏ డైరెక్టర్ కస్తూరి నర్సయ్య, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు దొడ్డా సురేష్‌బాబు, సొసైటీ చైర్మన్ అలసకాని జనార్దన్, హుజూర్‌నగర్ సహాయ సంచాలకుడు డాక్టర్ రూపకుమార్, పశువైద్యాధికారులు వీరారెడ్డి, శంకర్, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్, రైతులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

వేరుశనగ సాగుచేసిన రైతులకు జిప్సమ్ పంపిణీ



రైతులకు జిప్సమ్ పంపిణీ చేస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

గరిడేపల్లి: మండలంలోని గానుగుబండలో వేరుశనగ పంట సాగుచేస్తున్న ముగ్గురు రైతులకు బుధవారం గడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రంలో జిప్సమ్ పంపిణీ చేసినట్లు కేవీకే సీనియర్ శాస్త్రవేత్త బి. లకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా కేవీకే శాస్త్రవేత్త ఎ. కిరణ్ మాట్లాడుతూ.. ప్రస్తుతం వేరుశనగ పంట పూత దశలోనే ఉందని, ఈ సమయంలో ఎకరానికి 200కేజీల జిప్సమ్‌ను మొక్కల మొదళ్ల దగ్గర వేసి మట్టిని ఎగదోయాలని, ఆ తర్వాత ఎటువంటి అంతరకృషి చేయకూడదని అన్నారు. జింక్ లోపం ఉన్నట్లు అయితే దానిని నివారించేందుకు 400 గ్రాముల జింక్ సల్ఫేట్‌ను 200లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డి. నరేష్, గానుగుబండ గ్రామ రైతులు కొత్త వెంకట్‌రెడ్డి, అన్నెం సైదిరెడ్డి, నాగుల మీరా తదితరులున్నారు.

కార్మికుల హక్కుల సాధనకు ఉద్యమించాలి

యాదగిరిగుట్ట: కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కార్మిక చట్టాల సవరణకు వ్యతిరేకంగా కార్మికులంతా ఉద్యమించాలని మాజీ ఎమ్మెల్యే, ఏఐటీయూసీ రాష్ట్ర మహాసభల ఆహ్వాన సంఘం చీఫ్ ప్యాట్రన్ పల్లా వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. యాదగిరిగుట్టలో బుధవారం నిర్వహించిన ఏఐటీయూసీ రాష్ట్ర మహాసభల ఆహ్వాన సంఘం ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశానికి స్వాతంత్ర్యం రాకముందు ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను 4 కోడ్‌లుగా మార్చి కార్మికుల హక్కులను హరించి వేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎండీ.యూసూఫ్, ఎస్.బాల్‌రాజ్ మాట్లాడుతూ గతేడాది నవంబర్ 27, 28, 29వ తేదీల్లో యాదగిరిగుట్టలో జరిగిన ఏఐటీయూసీ రాష్ట్ర మహాసభలు విజయవంతం అయ్యాయని వెల్లడించారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు, ఏఐటీయూసీ సీనియర్ నాయకులు వి.ఎస్.బోస్, ఉజ్జిని రత్నాకర్‌రావు, ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నర్సింహ, రాష్ట్ర కార్యదర్శి బి.వెంకటేశం, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు యానాల దామోదర్‌రెడ్డి, బొలగాని సత్యనారాయణ తదితరులున్నారు.

హైదరాబాద్‌లో మహిళ గొంతు కోసి..

- మిర్యాలగూడ పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయిన నిందితుడు

మిర్యాలగూడ అర్బన్: హైదరాబాద్‌లో మహిళ గొంతు కోసి పరారైన నిందితుడు బుధవారం రాత్రి మిర్యాలగూడ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయినట్లు తెలుస్తోంది. మిర్యాలగూడ పట్టణంలోని తాళ్లగడ్డకు చెందిన గుడిసె కనకయ్య కుమారుడు హరికిషన్ హైదరాబాద్‌లో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. పట్టణంలోని సుందర్‌నగర్‌కు చెందిన కాంపాటి శారదతో గత ఏడాదిన్నరగా హరికిషన్ వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఇరువురు కలిసి హైదరాబాద్‌కు వెళ్లి బాలనగర్‌లో ఓ ఇల్లు అద్దెకు తీసుకుని నివాసముంటున్నారు. అయితే శారదపై అనుమానం పెంచుకున్న హరికిషన్ హైదరాబాద్‌లోని వారు నివాసముంటున్న ఇంట్లో ఆమె గొంతు కోసి ఇంటికి తాళం వేసి పరారైనట్లు తెలుస్తోంది. ఈ ఘటన తర్వాత నిందితుడు మిర్యాలగూడకు వచ్చి వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయినట్లు సమాచారం. అయితే వన్ టౌన్ పోలీసులు మాత్రం నిందితుడు లొంగిపోయినట్లు ధ్రువీకరించడం లేదు.